క్లుప్తంగా

వర్షం కోసం భజన



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న యువకులు

ఆస్పరి: స్థానిక మూల ఈశ్వరస్వామి ఆలయంలో నిర్వాహకులు శ్రీనివాసనాయన ఆధ్వర్యంలో వర్షం కురవాలని భజనలు చేశారు. సోమవారం ఉదయం ఆలయంలో స్వామి వారికి గంగాభిషేకం, పంచామృతాభిషేకం,మంగళ హారతులు తదితర పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం వరకు భజన కొనసాగుతుందని భక్తులు తెలిపారు.

మద్దికెర : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా చినుకు రాలలేదు. దీంతో సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్షం కోసం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో బొడ్రాయికి సోమవారం పూజలు నిర్వహించారు. ఉదయం పూజలు చేసి యువకులు ఉపవాసదీక్ష చేపట్టి బొడ్రాయిని ప్రత్యేకంగా అలంకరించి 101 బిందెలతో జలాభిషేకం చేసి పూజలు చేశారు.

ఈ-క్రాప్ నమోదు చేయాలి

తుగ్గలి: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు అధ్యక్షతన వీఆర్వోలు, వ్యవసాశాఖ సిబ్బంది, సర్వేయర్లకు పంట నమోదుపై అవగాహన కల్పించారు. సాగు చేసిన ప్రతి పంటను వచ్చేనెల 10వ తేదీలోపు నమోదు పూర్తి చేయాలని సూచించారు.

హొళగుంద: 2024 ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పని సరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ ఆనంద్ లోకదశ్ సూచించారు. సోమవారం ఆయన హొళగుంద పరిధిలోని పొలాల్లో వీఏఏలు చేస్తున్న పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు.

మద్దికెర : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేయించాలని ఏఓ రవి తెలిపారు. సోమవారం మండలంలోని మద్దికెర పడమర, ఉత్తరం ప్రాంతాల్లో చేపట్టిన ఈ-క్రాప్ బుకింగ్‌ను పర్యవేక్షించారు.

హాలహర్వి: సాగుచేసిన ప్రతి రైతు పంటలను నమోదు చేసుకోవాలని ఆలూరు ఏడీఏ సునీత, ఏఓ శివశంకర్ సూచించారు. ఈ మేరకు సోమవారం హాలహర్విలోని రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం వ్యవసాయ సిబ్బంది చేస్తున్న పంటల నమోదును పరిశీలించారు.

హంద్రీనీవాపై తూము ఏర్పాటు చేయాలి

చిప్పగిరి: హంద్రీ నీవా కాలువకు ఏబీసీ కెనాల్ వద్ద తూము ఏర్పాటు చేయాలని మండలంలోని ఆయకట్టు రైతులు తీర్మానించారు. సోమవారం మండలంలోని ఏరూరు గ్రామంలోఆయకట్టు రైతులు శేక్షావలి ఆధ్వర్యంలో సమావేశం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తూము ఏర్పాటుతో మండలానికి రావాల్సిన నీటి వాటా ఎలాంటి ఆటంకాలు లేకుండా అందుతుందన్నారు.

మినహాయింపునివ్వాలి

చిప్పగిరి: వీఆర్ఏలకు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే వాచ్‌మెన్ విధుల నుంచి మినహాయింపునివ్వాలని సీఐటీయూ నాయకులు నారాయణ స్వామి ఆధ్వర్యంలో వీఆర్ఏల సంఘం మండల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వాచ్‌మెన్ విధులు రద్దు చేసి ఖాళీగా ఉన్న రికార్డ్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు సీనియారిటీ ప్రకారం భర్తీ చేయాలని, అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

ఆస్పరి: భూ సర్వే సక్రమంగా చేయకపోవడంతో మా భూముల వివరాలు తప్పుల తడకగా ఉన్నాయని వాటిని సరిచేయాలని ముత్తుకూరు గ్రామ రైతులు సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి మాట్లాడుతూ అడంగల్‌లో సర్వే నంబర్లు, రైతుల పేర్లు తప్పుగా ఉన్నందున వారికి బ్యాంకులో పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు.అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గాయత్రీకి వినతి పత్రం అందజేశారు. రైతులు పాల్గొన్నారు.

వ్యాధులతో జాగ్రత్త

వెల్దుర్తి(కృష్ణగిరి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, పరిసరాల, స్వీయ శుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ (ఆర్‌బీఎస్‌కె) జిల్లా వైద్యాధికారి ఐ.హేమలత ఆరోగ్య అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఉలిందకొండ పీహెచ్‌సీ పరిధిలోనున్న వెల్దుర్తి మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామ ఎంపీయూపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఉలిందకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రఘు, హెచ్ఎస్ నాగరాజు పాల్గొన్నారు.

వ్యాధులపై పాడి రైతులకు అవగాహన

హాలహర్వి: పశువులకు వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలని ఏడీ వెంకటసుబ్బయ్య, మండల పశువైద్యాధికారి అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో గర్భకోశ వ్యాధులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గేదెలు, ఆవుల్లో గర్భం దాల్చని క్రమంలో వైద్య పరీక్షలు చేయించాలన్నారు. పశువులకు మేలు జాతి ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ చేపడతామన్నారు. సర్పంచ్ మల్లి పాల్గొన్నారు.

బడి..నిర్వహణ కొరవడి

- స్టూడెంట్ కిట్ పూర్తిస్థాయిలో అందజేయని ప్రభుత్వం
- బోధనకు సరిపడ ఉపాధ్యాయులు లేని వైనం
- 'మధ్యాహ్నం'లో ఇష్టారాజ్యం
- పాఠశాలల్లో కనిపించని పరిశుభ్రత



హత్తిబెళగళ్ గ్రామ ఎంపీపీ పాఠశాలలో చిన్నారులకు ఉడకని గుడ్లను వడ్డించిన నిర్వాహకులు





చిన్నజొన్నగిరి ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో ఐదు తరగతుల నిర్వహణ, పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్ఎస్‌లో పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్

పత్తికొండ నియోజకవర్గంలో ఉపాధ్యాయుల ఖాళీలు..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	ఉపాధ్యాయులు	ఖాళీలు
పత్తికొండ	46	8600	175	55
తుగ్గలి	66	7,127	188	51
మద్దికెర	26	3,038	65	19
కృష్ణగిరి	47	6,581	263	37
వెల్దుర్తి	61	8,492	338	50

ఆలూరు నియోజకవర్గంలో ఉపాధ్యాయుల ఖాళీలు..

మండలం,	పాఠశాలలు	విద్యార్థులు	ఉపాధ్యాయులు	ఖాళీలు
ఆలూరు	47	8,503	230	90
ఆస్పరి	53	8,951	211	41
చిప్పగిరి	30	4,174	140	32
దేవనకొండ	57	13,282	212	42
హాలహర్వి	39	6,521	152	76
హొళగుంద	44	12,290	280	90

ఆలూరు/తుగ్గలి/ కృష్ణగిరి/ మద్దికెర: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థకు వైభవం కల్పించింది. నాడు-నేడు కింద బడుల్లో 9రకాల వసతుల కల్పనతో పాటు పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దింది. జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని అందజేసింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ఉదయం రాగి జావ, చిక్కీలు, నాణ్యత కలిగిన రోజుకో రకం ఆహార పదార్థాలను వడ్డించేలా ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు చిక్కీలు ఇవ్వకపోవడం,గుడ్లు అందజేయకపోవడం, మధ్యా హ్న భోజనంలో మోనూ సక్రమంగా అమలు కావ డం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇక పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నా బోధనకు సరిపడ ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధన సక్రమంగా సాగ డం లేదు. ఇక నిర్వహణ కొరవడటంతో స్కూళ్ల పరిసరాల్లో పారిశుద్ధ్యం లోపించిందని తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల అదనపు తరగతి గదుల నిర్మాణాలు పూర్తి కాక పోవడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోంది. తగినన్ని తరగతి గదులు లేక ఆరుబయట, ఒకే గదిలో పలు తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. రాతన జెడ్పీహెచ్ఎస్‌లో మూడు గదుల్లో బోధన చేస్తున్నారు. రెండు తరగతులు ఆరుబయట నిర్వహిస్తున్నారు. పత్తికొండ నియోజకవర్గంలో మొత్తం 246 పాఠశాలల్లో 1029 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా.. 212 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది.

అరకొరగా స్టూడెంట్ కిట్ పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, షూ, మూడు జతల యూనిఫాం, బెల్టు, టై, బ్యాగ్, డిక్షనరీ తదితరాలను ఉచితంగా అందజేస్తుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇవన్నింటినీ పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు అందజేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిస్థాయిలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్ అందజేయలేదు. కొన్నిచోట్ల విద్యార్థులకు మూడు జతలకు బదులుగా రెండు జతలు, మరికొన్ని చోట్ల కొందరికి యూనిఫాం అందకపోవడం, పుస్తకాలు కొన్ని కొందరికి అందలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక డిక్షనరీలు పూర్తిస్థాయిలో పాఠశాలలకు చేరలేదని విద్యార్థులు చెబుతున్నారు. కొన్ని పాఠశాలల్లో తాగడానికి మంచినీరు లేక విద్యార్థులు ఇంటి నుంచే బాటిళ్లలో తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు మరమ్మతులకు గురైనా పట్టించుకోకపోవడంతో సమస్య నెలకొంది.

- ప్రస్తుతం మధ్యాహ్న భోజనంలో భాగంగా.. 1-5 వ,తరగతి విద్యార్థులకు రోజుకు రూ. 5.88 చొప్పున ఖర్చు చేస్తున్నారు.
- 6- 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.8.57 ప్రకారం ఖర్చు చేస్తున్నారు.
- జగనన్న గోరుముద్ద పేరుతో ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంగా పేరు మార్చినా మెనూ చార్టును ఇంకా ప్రకటించకపోవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన మెనూనే పాటిస్తున్నారు. అయితే విద్యార్థులకు పలుచోట్ల గుడ్లు, రాగిజావ సక్రమంగా అందజేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చిక్కీ కూడా ఒక్కో రోజు ఇవ్వడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇక ఆహారం నాణ్యత ఒక్కోరోజు ఒక్కో రకంగా ఉంటుందని విద్యార్థులు పేర్కొంటున్నారు.



నాడు -నేడు మొదటి విడతలో అందంగా రూపుదిద్దుకున్న చింతకుంట జెడ్పీ హైస్కూల్

మండలాల వారీగా మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

తుగ్గలి :	90.82 శాతం
పత్తికొండ :	96 శాతం
కృష్ణగిరి :	92.10 శాతం
వెల్దుర్తి :	93 శాతం
మద్దికెర :	95 శాతం

మండలాల వారీగా మధాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థులు

ఆలూరు:	94.80 శాతం
ఆస్పరి:	92. 78 శాతం
చిప్పగిరి,	92. 12 శాతం
దేవనకొండ,	93. 14. శాతం
హాలహర్వి,	89.90 శాతం
హొళగుంద	93.42 శాతం

విద్యావ్యవస్థపై ప్రభుత్వం దృష్టి సారించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. పర్యవేక్షణ కూడా పూర్తిగా లోపిస్తోంది. పిల్లలు పూర్తిగా క్రమశిక్షణ తప్పుతున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మధ్యాహ్నం భోజనంలో కూడా నాణ్యత తక్కువైంది. కొన్ని చోట్ల అదనపు గదుల నిర్మాణాలు నిలిచిపోవడంతో ఇరుకు గదుల్లో రెండు, మూడు తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యా వ్యవస్థపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

– కృష్ణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వెల్దుర్తి



చిప్పగిరి జెడ్పీ ఉన్నతపాఠశాలలో మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంట్

కార్పొరేట్ స్కూళల్లో చదివించే శక్తి మాకు లేదు



స్థానిక జెడ్పీహైస్కూల్లో మా అమ్మాయి శ్రీ లక్ష్మి 8వ, తరగతి చదువుతుంది. అయితే ఈ పాఠశాలలో సార్లోళ్లు కొంత మందే ఉన్నారని, వారు పాఠాలు చెప్పలేక పోతున్నారని తెలిసింది. ప్రభుత్వ బడిలో బాగా చదువు చెబుతున్నారని తెలిసి మా బిడ్డను వదిలాం. మేం కార్పొరేట్ పాఠశాలల్లో చదివించుకునే స్తోమత లేదు. పొలం పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాం. ఎంతమంది అవసరమో అంతమంది అయ్యవార్లను పెడితే పిల్లలు బాగా చదువుకుంటారు కదా. ప్రభుత్వం ఆలోచించాలి. ఒక్కోసారి మధ్యాహ్న భోజనం సరిగా ఉండటం లేదట.

– నరులవతి, తెర్నెకల్ గ్రామం

తగినంత ఉపాధ్యాయులు ఉండాలి



ప్రతి పాఠశాలలో చదువుతున్న 30 మందికి ఒక ఉపాధ్యాయుడు విద్యహక్కు చట్టప్రకారంగా నియమించాలి. అయితే ఇది జరిగే పని కాదు. ప్రస్తుతం మా అమ్మాయి ఎంపీపీ పాఠశాలలో 2వ, తరగతి చదువుతుంది. కావాల్సినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడంతోనే బోధన సరిగా జరగడంలేదు. మొదటి నుంచి ప్రభుత్వం ఉపాధ్యాయులను సరిపడా నియమించకపోవడంతో అపఖ్యాతి నెలకొంది. దాన్ని తొలగించడానికి కృషి చేయాలి. మధ్యాహ్న భోజనం మెనూ సక్రమంగా పాటించడం లేదు.

– దుర్గమ్మ, పాల్యకుర్తి గ్రామం

ఉపాధ్యాయుల కొరత వాస్తవమే



మండలంలోని ఎంపీపీ,జెడ్పీ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత ఉంది. అయితే పనిచేస్తున్న వారితోనే విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంచేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నాం. తక్కువ ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సబ్జెక్టులను బోధించి ఉత్తమ గ్రేడ్స్‌ను సాధించేందుకు నిరంతరం కష్టపడక తప్పదు.

– కోమలాదేవి ఆలూరు ఎంఈఓ

రైతు ఆత్మహత్య



కల్లా బోయ రామకృష్ణుడు (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని రామళ్లకోట గ్రామ రైతు కల్లా బోయ రామకృష్ణుడు (61) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య లక్ష్మీదేవి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. రామకృష్ణుడు తమ నాలుగెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లతో జీవనం సాగించాడు. అప్పులతో పిల్లలకు పెళ్లిళ్లు, పొలంలో బోర్లు వేయించాడు. గతేడాది మిరప, వేరుశనగ దిగుబడులు లేక, గిట్టుబాటు ధర లేక మరింత నష్టం పొందాడు. రూ.15లక్షల దాకా అప్పులయ్యాయి. దారిలేక, ప్రస్తుత సీజన్‌లో పంటలు సాగు చేయలేకపోయాడు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రించాక ఇంట్లోనే పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కృష్ణగిరి తహసీల్దార్ గా డి. చంద్రశేఖర్

కృష్ణగిరి: మండల నూతన తహసీల్దార్‌గా డి.చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మంత్రాలయం మండలంలో విధులు నిర్వహిస్తూ చిత్తూరు జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణపై బదిలీ అయ్యారు. అనంతరం జరిగిన బదిలీల్లో కృష్ణగిరి మండలానికి కేటాయించబడ్డారు. బాధ్యతల స్వీకరణ అనంతరం డీటీ విష్ణుప్రసాద్, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్‌ఓలతో సమావేశమై సీసీఆర్‌సీ కార్డుల దరఖాస్తుల వివరాలు, ధృవపత్రాల జారీ వివరాలపై సమీక్షించారు.

పత్తికొండ అర్బన్ సీఐగా జయన్న



తుగ్గలి(పత్తికొండ) : పత్తికొండ అర్బన్ సీఐగా ఎ.జయన్న నియమితులయ్యారు. ఇది వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ కె.మురళీ మోహన్ వీఆర్ ఎస్పీకి వెళ్లారు. ఆయన స్థానంలో కర్నూలు ఫ్యాక్షన్ జోన్‌లో విధులు నిర్వహిస్తున్న జయన్న ఇక్కడి వచ్చారు. ఈ మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

తుగ్గలి ఎస్ఐగా జమీర్

తుగ్గలి : ఎస్ఐగా జమీర్ నియమితులయ్యారు. పత్తికొండ ఏఎస్ఐగా ఉన్న ఈయన పదోన్నతిపై ఇక్కడి వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన మల్లికార్జున సెలవులో వెళ్లారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

హాలహర్వి తహసీల్దార్‌గా నజ్మాబాను



హాలహర్వి: ప్రజలకు సేవ చేసేందుకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హాలహర్వి నూతన తహసీల్దార్ ఎస్.నజ్మాబాను పేర్కొన్నారు. సోమవారం ఆమె హాలహర్వి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకముందు సత్యసాయి జిల్లా తాడిమర్రి మండల తహసీల్దార్‌గా పనిచేసినట్లు చెప్పారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బ్యూలా చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌కి బదిలీ అయ్యారు.



వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.మధుసూదన్ రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మిగనూరు టౌన్ నుంచి బదిలీపై వచ్చిన ఈయనను సర్కిల్ కార్యాలయంలో వెల్దుర్తి, కృష్ణగిరి ఎస్ఐలు సునీల్‌కుమార్, ఖాజావలి మర్యాద పూర్వకంగా కలిశారు.

తల్లిపాలు అమృతం

వెల్దుర్తి(కృష్ణగిరి): తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సీడీపీఓ లూక్ పేర్కొన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సోమవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు.

వసతి గృహం ఏర్పాటు చేయాలి

చిప్పగిరి: మండల కేంద్రంలో మోడల్ స్కూల్, బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కడవల రవికుమార్ కోరారు. సోమవారం ఎమ్మెల్యే విరూపాక్షిని చిప్పగిరిలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

తల్లిపాలను మించిన ఔషధం లేదు

తుగ్గలి(పత్తికొండ): బిడ్డకు తల్లి పాలను మించిన ఔషధం మరొకటి లేదు.. ఎన్ని డబ్బులు ఖర్చు చేసినా రాని ఆరోగ్యం ఒక్క తల్లిపాలతోనే వస్తుందని పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. పుట్టిన ప్రతి బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కరమని వైద్య నిపుణులు చెబుతున్నారన్నారు. తల్లిపాలు బిడ్డ ఆకలి తీర్చడంతో పాటు పోషకాలు, రోగనిరోధశక్తి లభిస్తుందన్నారు. నవజాత శిశువుకు చేసే మేలు, పాలు ఏ విధంగా బిడ్డకు తాగించాలనే అంశాలపై తల్లులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సీడీపీఓ నరసమ్మ, ఐసీడీఎస్, హెల్త్‌సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పత్తికొండలో జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

వీడిన హత్య కేసు మిస్టరీ

- ముగ్గురు నిందితుల అరెస్టు
- రూ.7లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం





హత్య కేసు నిందితుల అరెస్టు చూపుతున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ,డీఎస్పీ నుంచి రివార్డు అందుకుంటున్న ఆస్పరి సీఐ హనుమంతప్ప

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు గ్రామ సమీపంలోని వంక దగ్గర జూలై 28న ఓ వ్యక్తిని హత్య చేసి డ్రమ్ములో కుక్కి పడేసిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇందులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.7లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచారు. ఈకేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వివరించారు. ఆయన చెప్పిన వివరాలు మేరకు గోనెగండ్ల మండలం మసీదుపురం గ్రామానికి చెందిన పేటయ్య (45)కు భార్య వరలక్ష్మి, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పేటయ్య గ్రామంలో అప్పులు చేశాడు. అప్పులు తీర్చమని రుణదాతలు ఒత్తిడి చేయడంతో తట్టులేక తనకున్న 60 సెంట్ల భూమిని తమ్ముడు నల్లప్పకు రూ.17.50 లక్షలకు అమ్మేశాడు. మొదట అడ్వాన్సుగా పేటయ్యకు రూ.10 లక్షలు ఇచ్చాడు. మిగిలిన రూ.7.50 లక్షలను దొడ్డిమేకలలో ఉన్న అక్క, బావ సమక్షంలో జూలై 24న అన్న పేటయ్యకు ముట్టజెప్పాడు. పొలం అమ్మిన విషయం తెలుసుకున్న మసీదుపురం గ్రామానికి చెందిన బోడిబండ నరసింహుడు, ఆలూరు మండలం హుళేబీడుకు చెందిన హనుమంతు కలిసి పేటయ్య డబ్బును కాజేయాలని పథకం పన్నారు. బోడిబండ నరసింహుడు, హుళేబీడు హనుమంతుకు నేర చరిత్ర ఉంది. వారిద్దరూ..రూ.లక్ష ఇస్తే మూడు లక్షల దొంగ నోట్లు ఇస్తామని పేటయ్యకు ఆశ చూపారు. ఎక్కువ డబ్బు వస్తుందని, అప్పులు తీరిపోతాయని ఆశ పడిన పేటయ్య.. బోడిబండ నరసింహుడుతో కలిసి మసీదుపురం నుంచి హుళేబీడుకు ఈనెల 25వ తేదీన రూ.7.50 లక్షలతో వచ్చారు. ఆదే రోజు హుళేబీడు గ్రామ సమీపంలో పంపయ్య ఆచారి పొలంలో పేటయ్య, బొడిబండ నరసింహుడు, హనుమంతు కలిసి మద్యం సేవించారు. ఆ తరువాత మద్యం గ్లాసులోకి సైనేడు వేసి పేటయ్యకు బలవంతంగా తాగించారు. తాపిన 15 సెకన్లలోనే పేటయ్య మృతి చెందాడు. పేటయ్య మృతదేహాన్ని పంపయ్య ఆచారి పొలంలో షెడ్ వద్ద ఉన్న పేడ దిబ్బలో పూడ్చారు. పూడ్చిన రెండు రోజులకు దుర్వాసన వస్తుండడంతో ఎవరికైనా తెలుస్తుందని జూలై 28న బోడిబండ నరసింహుడు, హనుమంతు, పంపయ్య ఆచారి కలిసి ప్లాస్టిక్ డ్రమ్ములో కుక్కి ఆటోలో ఆస్పరి మండలంలోని చిన్నహోతూరు వంక దగ్గర ముళ్ల పొదల్లో పడేసి వెళ్లారు. వంకలో పశువులు మేపుతున్న చిన్నహోతూరుకు చెందిన ఒక మహిళ దుర్వాసన వస్తుందని గ్రామస్తులకు చెప్పడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి గాలించారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆటోను కనుగొని నిందితులు బోడిబండ నరసింహుడు, హనుమంతు, పంపయ్య ఆచారిని ఆలూరు మండలం హుళేబీడు బస్టాప్ దగ్గర సోమవారం అరెస్టు చేసి వారి నుంచి రూ.7లక్షలు, మూడు సెల్ ఫోన్లు, సైనెడ్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారని, విచారణ చేసి మంగళవారం నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ వెల్లడించారు. హత్య కేసు ఛేదించిన ఆస్పరి, ఆలూరు, పత్తికొండ, దేవనకొండ, కర్నూలు క్రైం సీఐలు సీఐ హనుమంతప్ప, వెంకటేశులు, మురళీమోహన్, శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి, ఆదినారాయణరెడ్డి పోలీసు సిబ్బందిని అభినందించి రివార్డు అందజేశారు.



మృతుడు పేటయ్య (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హాలహర్వి: బాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తిప్పయ్యస్వామి కుమారుడు సురేష్ (25) శుక్రవారం రాత్రి కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి కారులో బెంగళూరుకు వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సురేష్‌ను బళ్లారిలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. సొంత గ్రామమైన బాపురం గ్రామానికి సోమవారం సురేష్ మృతదేహాన్ని తీసుకొచ్చి అంత్యక్రియలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి సురేష్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి, చెన్నప్ప ఆచారి, అర్ధగేరి శ్రీనివాసులు, శివరాజుగౌడ్, సుంకప్ప, సుగన్నగౌడ్, నాగరాజు, సుంకప్ప, కె.నగన్నగౌడ్, గోపాల్ ఉన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఆస్పరి: ఆస్పరికి చెందిన కావలి చిన్న సరసన్న (52) సోమవారం జొహరాపురం రోడ్డుకు వెళ్లే పొలంలో అనుమానాస్పదంగా మృతి చెందాడని ఆస్పరి సీఐ హనుమంతప్ప తెలిపారు. రెండు రోజల క్రితం ఇంటి నుంచి వెళ్లిన చిన్న సరసన్న తిరిగి రాలేదని.. దీంతో కుటుంబ సభ్యులు గాలిస్తుండగా..పొలంలో మృతి చెంది ఉండటాన్ని గమనించారు. మృతుడుకి భార్య అంజినమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్యఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

కారును ఢీకొట్టిన లారీ.. ఆరుగురికి గాయాలు

దేవనకొండ: కర్నూలు-బళ్లారి ప్రధాన రహదారిపై దేవనకొండ మండలంలోని కరివేముల గ్రామ శివారులో సోమవారం కారును లారీ ఢీకొట్టిన ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలైనట్లు బాధితుడు మదన్‌మోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తమది హైదరాబాద్ నగరమని గోకర్ల దేవాలయాన్ని సందర్శించేందుకు వచ్చామని చెప్పారు. కుటుంబంతో కలిసి కర్నూలుకు టాటా కారు (టీఎస్07 ఈఎం3745)లో వెళ్తుండగా కరివేముల గ్రామం వద్ద లారీ (కేఏ34సీ3842) వేగంగా వచ్చి ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో తనతో పాటు తన భార్య, పిల్లలు గాయపడ్డారన్నారు. క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మదన్‌మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దేవనకొండ పోలీసులు తెలిపారు.